హంలో ఇంతవరకూ ముందుకు సాగేడు. కానీ చివరికి, అంతా కనుక్కొని, వెనుదిరిగి చూసుకొంటే....తను సాధించిందేమిటి?

డిస్ట్రక్షన్! సర్వనాశనం!!

అతడికి నవ్వూ యేడుపూ ఒకేసారి వచ్చినయ్. అన్ని ఫీలింగులకూ అతీతుడైన ఆ వృద్ధుడి మనసులో కలవరం మొదలైంది.

"ఏం కనుక్కొన్నారు?" శైలజ అడిగింది.

"చాలా గొప్పవిషయాన్ని కనుక్కొన్నాం" అన్నాడు రమణ ఉరకలేస్తున్న ఉత్సాహంతో. "రేపు రాత్రితో...."

"ఆగు" అరిచేడు ప్రొఫెసరు.

రమణ చప్పున చెబుతున్నది ఆపి, చిత్రంగా అతడివైపు చూసేడు. "ఈ విషయం వెల్లడి కావటానికి వీల్లేదు" అన్నాడు. అతడి ముడతలుపడ్డ చెక్కిళ్ళు ఆవేశంతో బిగుసుకున్నాయి. కళ్ళు తీక్షణంగా వెలుగుతున్నాయి. మనిషి ఆవేశంతో ఊగిపోతున్నాడు. పిడికిళ్ళు బిగించి "ఈ విషయం వెల్లడి కావడానికి వీల్లేదు. ముఖ్యంగా పత్రికల వాళ్ళకి —" అన్నాడు. ఇన్నాళ్ళూ మిగతా అబ్జర్వేటరీస్ అన్నీ ఈ విషయాన్ని ఎందుకు వెల్లడి చెయ్యలేదు? అమెరికా, రష్యాలు యెందుకు చెప్పలేదు? ప్రొఫెసర్‌కి అప్పుడు అర్థమయింది....ఈ విషయం వెల్లడి చెయ్యటంవల్ల వచ్చే లాభం ఏమిటి? కేవలం ప్రజల్లో భయోత్పాతం తప్ప! చావు ఎలానూ తప్పనప్పుడు అది తెలియకుండా కావటమే మంచిది. అంతా నిశ్శబ్దంగా జరిగిపోవాలి. తమ పరిశోధన తమతోనే అంతం అయిపోవాలి. ఈ ఆలోచనతోనే అతడు చెప్పొద్దన్నాడు.

రమణ అతని వైపు నిదానంగా చూసేడు.

రమణ ఆలోచన్లు వేరు. ఇంకోలా అర్థం చేసుకొన్నాడు.

ప్రపంచం ఇక పన్నెండు రోజుల్లో అంతం కవబోతూంది. ఆ విషయం అందరికీ తెలిస్తే — దీన్ని ఈ విపత్కర పరిస్థితినుంచి రక్షించటానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తారు. ప్రతీ సైంటిస్టూ ప్రాణాలు ధారబోసి దీన్ని ఆపటానికి పరిశోధనలు మొదలుపెడ్తాడు. ఈ వృద్ధుడు ఎందుకు తనని చెప్పొద్దంటున్నాడు?

అతడికి చప్పున ఓ విషయం అర్థమయింది.

నోబుల్ ప్రైజ్!

అవును. నోబుల్‌ప్రైజ్.

ఈ పదిరోజులూ ఏదైనా కృషిచేసి, దీన్ని తనే సాధించాలని ఈ ప్రొఫెసర్ ప్రయత్నం. ఒకవేళ తను సాధించలేకపోతే ఈ ప్రపంచం నాశనమైపోయినా దానికి సిద్ధపడ్తాడు కానీ, ఈ అవకాశం మరొకరికి దక్కనివ్వడు.

'మనిషెంత స్వార్థపరుడు!' అనుకొన్నాడు రమణ.

ఒకవైపు కొంప అంటుకు పోతూవుంటే, ఇంకోవైపు అందులో తనకేం దొరుకుతుందా అని వెతుకుతున్నాడు ప్రొఫెసర్.

అతడో నిర్ణయానికి వచ్చేడు. ప్రొఫెసరు వైపు సూటిగా చూసి "నేను చెప్పాలి. చెప్పకుండా నన్నెవరూ ఆపుచెయ్యలేరు" అన్నాడు. అని, ఆమెవైపు తిరిగి, "రేపు రాత్రి పన్నెండుగంటలకి...." అంటూ యేదో అనబోయాడు.

ప్రొఫెసరు కదిలేడు. నరనరాల్లో వున్న బలం అంతా చేతుల్లోకి తెచ్చుకొని, రమణ నోరు మూయ్యటానికి ప్రయత్నించేడు. కానీ అతడి బలం చాల్లేదు. ఒక్క విసురుతో పడిపోయేడు.

రమణ ఆమెవైపు తిరిగి, "మన పత్రికకి ఒక న్యూస్! ఎవరూ నమ్మలేనిది. కానీ పచ్చి నిజం. ఎవరూ నమ్మలేకపోయినా అది నిజం!! ఈ ప్రొఫెసర్ యెంత గొప్పవాడో నాకు తెలుసు. కేవలం స్వార్థంవల్ల ఇలా అయ్యేడు. కానీ నిజంగా గొప్పవాడు. అతడి లెక్క తప్పటానికి వీల్లేదు. శైలజగారూ వినండి. రేపు రాత్రి చంద్రుడికి ఆఖరు రాత్రి. స్మాష్. చంద్రుడు స్మాష్ అవబోతున్నాడు. ప్రకటించండి. మన పత్రికలో పెద్ద అక్షరాల్తో ప్రకటించండి. ప్రపంచపు భవితవ్యం రేపు రాత్రి పన్నెండుగంటలకి తేలిపోతుంది. అందర్నీ చూడమనండి. ప్రపంచాన్ని రక్షించటానికి అందర్నీ నడుం కట్టుకోమనండి...."

(ఇంకా వుంది)



మినీ కథ

# తాయెత్తు మహిమ

కె. వి. యస్. వర్మ

పన్నెండేళ్ళ నరసింహరాజుకు కన్నీళ్లొచ్చాయి. అతని చుట్టూ నలుగురు కుర్రాళ్ళు మూగారు. సైకిలికి తగిలించిన కారియర్ వుంది. సైకిల్ మాత్రం లేదు. స్కూలు విడిచిపెట్టి, అప్పుడే అరగంటయ్యింది.

ఏడుపుమొహంతో నరసింహరాజు హెడ్ మాస్టారి దగ్గరి కెళ్ళాడు. తన సైకిల్ పోయిందని చెప్పాడు. పెద్దవాళ్ళను తీసుకునివెళ్ళి, పోలీసు రిపోర్టివ్వమని హెడ్‌మాస్టరు సలహా యిచ్చాడు.

నరసింహరాజు బిక్కమొహం వేసి, స్నేహితుని సైకిల్‌మీద యింటికెళ్ళాడు. ఏడుస్తూ, సైకిల్ పోయిందని తండ్రికి చెప్పాడు.

"ఫర్వాలేదు. యేడవకు. రేపు రిపోర్టిద్దాం. ఆ సైకిలు దొరక్కపోతే, కొత్తది కొంటాను. సరేనా" అని తండ్రి బుజ్జగించాడు.

నరసింహరాజు పడుకున్నాడు. రెండు రోజుల క్రితమే సైకిల్ సీటుకు వేయించిన వచ్చకవరు కల్లో కొచ్చింది.

మర్నాడు, నరసింహరాజును తీసుకుని పోలీసుస్టేషన్‌కు వెళ్ళాడు అతని తండ్రి. అప్పుడక్కడ హెడ్ కానిస్టేబుల్, మరికొందరు పోలీసులూ వున్నారు. హెడ్ కానిస్టేబుల్‌కు నరసింహరాజు తండ్రి సైకిల్ పోయిన విషయం చెప్పాడు.

"అలాగా" అని గంభీరంగా తలూపి, "అనుమానం వచ్చి నిన్నో సైకిలు పట్టుకున్నాం. అదేనేమో చూడండి" అన్నాడు హెడ్ కానిస్టేబుల్. నరసింహరాజు పరుగున వెళ్ళి చూశాడు. సైకిలు తనదే. అతనికి హెడ్ కానిస్టేబుల్ దేవుడిలా కనిపించాడు. అంతా గమ్మత్తుగా వుందతనికి. తండ్రి థాంక్సుచెప్పి వచ్చేయబోతుంటే "అదేమండీ. రెండొందల రూపాయల సైకిలు దొరికితే...." అన్నాడు హెడ్ కానిస్టేబుల్. తండ్రి నవ్వి, రెండుపదులు అతని చేతిలో పెట్టి, సైకిలు తీసుకుని బయటకు వచ్చేశాడు.

"నాన్నా, సైకిలు బలే పట్టుకున్నారు కదూ...."

"యేడ్చేరు. అంతా నాటకం" అన్నాడు తండ్రి కోపంగా.

నరసింహరాజుకు అర్థం కాలేదు. అతనికా మాయ అర్థం కావడానికి యిరవైయేళ్ళు పట్టింది. ఇప్పుడతను సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. □